క్లుప్తంగా

కబడ్డీలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి



రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులకు కృతజ్ఞతలు తెలుపుతున్న జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

కోదాడ : కబడ్డీ క్రీడలో సూర్యాపేట జిల్లాను అగ్రస్థానంలో నిలపడానికి జిల్లా అసోసియేషన్ కృషి చేయాలని రాష్ట్ర అసోసియేషన్ సభ్యులు కోరారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్‌కు వారు గుర్తింపు పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అల్లం ప్రభాకర్‌రెడ్డి, నామ నరసింహారావు మాట్లాడారు. జిల్లాలో క్రీడాకారులను ప్రోత్సహిస్తామని తెలిపారు. జిల్లా అసోసియేషన్‌కు గుర్తింపు పత్రాన్ని జారీ చేయడంతో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కాసాని విరేష్, మహేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధాశ్రమంలో వృద్ధులకు చీరలు పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న దాతలు

మునగాల : మండలంలోని ముకుందాపురం గ్రామపంచాయతీ శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో ఆదివారం కోదాడ మండలంలోని నల్లబండగూడెం గ్రామానికి చెందిన అలసగాని సుజాత -శ్రీనివాసరావు దంపతులు ఆశ్రమంలో ఉన్న వృద్ధ మహిళకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆశ్రమ వ్యవస్థాపకురాలు నాగిరెడ్డి విజయమ్మకు రూ.10వేల నగదు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఆశ్రమ వ్యవస్థాపకురాలు నాగిరెడ్డి విజయమ్మ, ఇన్‌చార్జ్ వాచేపల్లి జ్యోతి, ఎలమంచలి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు సామాజిక తనిఖీపై ప్రజావేదిక

పాలకవీడు : ఉపాధిహామీ పనులపై మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఆదివారం తెలిపారు. ఉపాధిహామీ పథకం కింత చేపట్టిన పనులు, కూలీల హాజరు, చెల్లింపులు తదితర అంశాలపై ప్రజా వేదికలో చర్చించనున్నట్లు, ఈ కార్యక్రమానికి గ్రామస్తులు, కూలీలు, పంచాయతీ ప్రతినిధులు సంబంధిత అధికారులు పాల్గొనాలని, సామాజిక తనిఖీ ప్రజావేదిక ద్వారా ప్రజలు నేరుగా ప్రశ్నలు అడిగే అవకాశం లభించనుందన్నారు. ఉపాధిహామీలో మండలంలో చేపట్టిన పనుల పర్యవేక్షణకు ఈ కార్యక్రమం ద్వారా పారదర్శకత పెరుగుతుందని ఎంపీడీఓ పేర్కొన్నారు.

స్వయం సహాయక సంఘం సిల్వర్‌జూబ్లీ వేడుకలు



సహపంక్తి భోజనం చేస్తున్న మహిళలు

చిలుకూరు : మండల పరిధిలోని పాలెఅన్నారంలో ఆదివారం మార్గదర్శిని సమభావన సంఘం సిల్వర్ జూబ్లీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. 2000సంవత్సరంలో స్థాపించిన ఈ సంఘంలో 60ఏళ్ల పైబడిన మహిళలను ఘనంగా సన్మానించారు. అనంతరం సంఘం సభ్యులు సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం మరింత తోడ్పాటునందించాలని కోరారు.

నూతనంగా ఆర్టీసీ బస్సు సర్వీసు ప్రారంభం



బస్సును అలంకరించిన జెర్రిపోతులగూడెం గ్రామస్తులు

చిలుకూరు : మండలంలోని పలు గ్రామాలకు ఎన్నో ఏళ్ల తర్వాత ఆర్టీసీ అధికారులు బస్సు సర్వీసును ప్రారంభించారు. ఆదివారం కోదాడ డిపో నుంచి బస్సు ఆయా గ్రామాలకు రావడంతో గ్రామస్తులు బస్సును అలకరించారు. ఈ బస్సు ప్రతి రోజు ఉదయం కోదాడ డిపో నుంచి ప్రారంభమై విజయవాడ- హైదరాబాద్ జాతీయ రహదారి మీదుగా మునగాల మండలంలోని బరాఖత్‌గూడెం నుంచి చిలుకూరు మండలంలోని పోలేనిగూడెం మీదుగా బేతవోలు, జెర్రిపోతులగూడెం గ్రామం వరకు వెళ్తుంది. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం రెండు ట్రిప్పులు నడపనున్నట్లు, విద్యార్థుల కోసం ఈ సర్వీసును ప్రారంభించినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

వన మహోత్సవానికి సన్నద్ధం

- నర్సరీల్లో సిద్ధంగా ఉన్న మొక్కలు
- మండలంలో లక్షా 80వేల మొక్కలు నాటడమే లక్ష్యం
- గుంతలు తీసే పనులు ప్రారంభం
- త్వరలో ఇంటింటికీ పంపిణీ



చిలుకూరు మండలం రామాపురంలో నాటేందుకు సిద్ధంగా ఉన్న మొక్కలు



కొండాపురం నర్సరీలో..

చిలుకూరు : రాష్ట్రంలో పచ్చదనం పెంచడంతో పాటు పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం ఏటా వనమహోత్సవం కార్యక్రమాన్ని చేపడుతుంది. ఇందులో భాగంగా ఈఏడాది కూడా మొక్కలు నాటేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. తొలకరి వర్షాలు కురిసిన తరువాత గ్రామాల్లో జరిగే వన మహోత్సవానికి మండలంలోని నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. మండల వ్యాప్తంగా 17గ్రామపంచాయతీల్లో లక్షా 80వేల మొక్కలు సిద్ధం చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ మొక్కలను వర్షాలు కురవగానే గ్రామాల్లో రోడ్లు, ప్రధాన రహదారుల వెంట, పాఠశాలలు, కళాశాలలో మొక్కలు నాటిన తరువాత ఇంటింటికి మొక్కలు పంపిణీ చేస్తారు. గ్రామ నర్సరీల్లో ప్రస్తుతం టేకు, ధానిమ్మ, జామ, బొబ్బాయి, సీతఫలం, గుల్‌మోర్, గుమ్మడి టేకు, వేప, చింతా, గానుగ, శ్రీగంధం, మలబారువేపు, పూల మొక్కలు సిద్దంగా ఉన్నాయి. ప్రతి రోజు నర్సరీల్లో మొక్కలకు నీళ్ల పోస్తూ, ఎండలకు మొక్కలు ఎండిపోకుండా ఉండేందుకు షెడ్‌నెట్లు ఏర్పాటు చేశారు. గ్రామ వన సేవకులు నర్సరీల్లోని మొక్కల్లో పెరిగిన పిచ్చిమొక్కలను ఎప్పటికప్పుడు తొలగిస్తూ రక్షిస్తున్నారు. ఈ నర్సరీలను జిల్లా స్థాయి అధికారులతో పాటు మండల స్థాయిలో నిత్యం ఎంపీడీఓ గిరిబాబు, ఏపీఓ నిర్మల, టీఏలు మాధవి, స్రవంతి, గిరిప్రసాద్, సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ మొక్కలు పెంచుతున్నారు. గ్రామాల్లో మొక్కలు నాటేందుకు ప్రస్తుతం ఉపాధిహామీ కూలీలతో గుంతలు తీయిస్తున్నారు. గ్రామంలో కనీసం 2వేలకు పైగా గుంతలు తీయిస్తున్నారు. వర్షాలు సమృద్ధిగా కురవగానే మొక్కలు నాటేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

లక్షా 80వేల మొక్కలు పెంచుతున్నాం



మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లోని నర్సరీల్లో లక్షా 80వేల మొక్కలు పెంచుతున్నాం. వర్షాలు పడగానే ప్రభుత్వం ఆదేశాల మేరకు కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటుతాం. అదే విధంగా మొక్కలను ఇంటింటికి పంపిణీ చేసి, ప్రతి ఇంట్లో నాటేలా చూస్తాం. ఇందుకు నిత్యం నర్సరీలను పరిశీలిస్తున్నాం. ప్రస్తుతం గ్రామాల్లో గుంతలు తీసేపనులు జరుగుతున్నాయి.

– నిర్మల, ఏపీఓ, చిలుకూరు

కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్లకు పట్టాలు ఇవ్వాలి



సంతకాల సేకరణ చేస్తున్న కాలనీవాసులు

కోదాడ : పట్టణంలోని లక్ష్మీపురం ఇందిరమ్మ కాలనీలో ఇళ్ల నిర్మాణం జరిగి 18సంవత్సరాలు అవుతున్నా నేటి వరకు కాలనీవాసులకు ఇళ్ల పట్టాలు ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఇళ్ల పట్టాలను ఇవ్వాలని ఆదివారం సామాజిక ఉద్యమకారుడు బషీరుద్దీన్ ఆధ్వర్యంలో కాలనీలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. 2013లో బషీరుద్దీన్ ఆధ్వర్యంలో నిరహార దీక్షలు చేశామని అపుడు పట్టాలిస్తామని చెప్పిన అధికారులు నేటి వరకు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతి కల్పించుకొని వెంటనే కాలనీ వాసులకు ఇళ్ల పట్టాలు ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో భాస్కర్‌రావు, శంకర్, నాగేశ్వరరావు, నన్నే సాహెబ్, సిద్దయ్య, నరేష్, డాక్టర్ పాషా, బడే మియా, వెంకటరత్నం, అన్నపూర్ణ, సరోజదేవి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులను అరికట్టడంలో విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కోదాడరూరల్ : సీజనల్ వ్యాధులను అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ప్రగతిశీల యువజన సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నల్గొండ నాగయ్య, ధరావత్ రవి అన్నారు. ఆదివారం పట్టణంలోని లాల్‌బంగ్లాలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వర్షాకాలం సీజన్ ప్రారంభమైన పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులు నివారణకు ప్రభుత్వం కనీస చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వ వైద్యశాలలో పేద ప్రజలకు కావాల్సిన అన్ని రకాల వసతులను ఏర్పాటు చేసి వాటిపై నమ్మకం కలిగించే విధంగా చూడాలన్నారు. సీజనల్ వ్యాధుల పేరుతో ప్రైవేట్ ఆస్పత్రిల్లో జరుగుతున్న దోపడీని అరికట్టాలన్నారు. కార్యక్రమంలో బొనగిరి గిరిబాబు, బండి రవి తదితరులు ఉన్నారు.

శాస్త్రోక్తంగా శ్రీలక్ష్మీనృసింహుడి నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి : మండలంలోని మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్య హోమం, పంచామృతాభిషేకం నిర్వహించారు. నూతన పట్టు వస్త్రాలంకరణ గావించి ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. అంతేగాక శ్రీస్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు రామాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సోషల్‌మీడియా ప్రచారాలపై అప్రమత్తంగా ఉండాలి

మునగాల : సోషల్‌మీడియా ప్రచారాలపై మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సామాజిక మాధ్యమాలలో ఎవరైనా తప్పుడు సమాచారం షేర్ చేస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ బి.ప్రవీణ్‌కుమార్ ఆదివారం హెచ్చరించారు. సోషల్‌మీడియాను ఉపయోగించేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, యూట్యూబ్, ఎక్స్ తదితర సామాజిక మాధ్యమాలలో ఇతరులను కించపరిచేలా, రెచ్చగొట్టేలా అవమానకర పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సామాజిక మాధ్యమాలలో అసభ్యకర పోస్టులు పెట్టేలా ప్రోత్సహించడం, సహకరించడం, కుట్ర చేయడం వంటివి కూడా చట్టరీత్యానేరమన్నారు. గ్రూపులో అడ్మిన్లు జాగ్రత్త వహించాలని సూచించారు. యువత అనవసర చిక్కుల్లో పడి భవిష్యత్ నాశనం చేసుకోవద్దన్నారు.

ఎన్‌సీఎల్ వైద్యాధికారికి ఉత్తమ సేవల అవార్డు



డాక్టర్ శ్రీహరిరావును అవార్డుతో సన్మానిస్తున్న కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ తదితరులు

మఠంపల్లి : మండలంలోని ఎన్‌సీఎల్ పరిశ్రమ వైద్యాధికారి డాక్టర్ జల్లిపల్లి శ్రీహరిరావు ఉత్తమ సేవలందిస్తున్నందుకు గాను ఆదివారం ఢిల్లీలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ టౌన్‌ప్లానర్స్ ఇండియా ప్రాంగణంలో డాక్టర్స్‌డేను పురస్కరించుకుని కేంద్రమంత్రి జితేంద్రసింగ్ జాతీయ స్థాయి ఉత్తమ సేవల అవార్డును ప్రదానం చేశారు. ఈ సదర్భంగా డాక్టర్ శ్రీహరిరావు స్థానికంగా మాట్లాడారు. వైద్యవృత్తిలో ఉండి గ్రామీణ పట్టణ ప్రాంతాలలో అనేక బ్లడ్ డొనేషన్ క్యాంపులు, మెడికల్ క్యాంపులు నిర్వహించి 1566బ్లడ్ బాటిల్స్ ప్రభుత్వ హాస్పిటల్స్‌కు, రెడ్ క్రాస్ సొసైటీకి అందించడంతో ఈ అవార్డు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఢిల్లీ ఎమ్మెల్యే డాక్టర్ అనిల్‌గోయల్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ దిలీప్‌బన్సాలీ, ఐఎంఏ ఎక్స్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్‌వీ అశోకన్ పాల్గొన్నట్లు తెలిపారు. శ్రీహరిరావుకు అవార్డు రావడం పట్ల ఎన్‌సీఎల్ పరిశ్రమ అధికారులు చక్రధర్, సతీష్, దస్తగిరిరెడ్డి, ఉద్యోగులు అభినందించారు.

పరిమితికి మించి వైద్యం చేయొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీశైలంగౌడ్

మునగాల : గ్రామీణ ప్రాంతాలలో ఆర్‌ఎంపీ, పీఎంపీలు పరిమితికి మించి వైద్యం చేయొద్దని గ్రామీణ వైద్యుల సంఘం మండల అధ్యక్షుడు ఎరుకల శ్రీశైలంగౌడ్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని మునగాల పబ్లిక్‌స్కూల్ ఆవరణలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని గ్రామీణ వైద్యులకు పలు సూచనలు, సలహాలు చేశారు. తమ వద్దకు వచ్చే రోగులకు కేవలం ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాలని, రాబోయే సీజన్ వ్యాధులను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని, అర్ధాంతరంగా ఆగిపోయిన పారామెడికల్ శిక్షణ తరగతులు తిరిగి ప్రారంభించి సర్టిఫికెట్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలో ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలను సంఘం తరపున పరిష్కరించి ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం సంఘంలోకి నూతనంగా వచ్చిన సభ్యులకు ఐడీకార్డులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంఘం సభ్యులు గుణగంటి వెంకన్నగౌడ్, ఎస్‌పీ వెంకటప్పయ్య, దొంతగాని రవిబాబు, భూతం శ్రీనివాస్, ఉపేంద్రచారి, వెలుగోరి అనిల్‌కుమార్, ఆదినారాయణ, కనకాచారి, నరసింహారావు, శ్రీనివాసగౌడ్, జానీపాషా, శ్రీనివాసరెడ్డి, వీఎల్‌ఎం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పోషణ్ ట్రాకర్ యాప్‌ను తొలగించాలి

గరిడేపల్లి : అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండు యాప్‌లను నిర్వహిస్తున్నాయని, వాటిలో రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌హెచ్‌టీఎస్ యాప్, కేంద్ర ప్రభుత్వం పోషణ్ ట్రాకర్ యాప్‌ను ఉపయోగిస్తుండడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, పోషణ్ ట్రాకర్ యాప్‌ను తీసివేసి అంగన్‌వాడీ టీచర్ల ఇబ్బందులను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా నాయకుడు పోకల వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పోషణ్ ట్రాకర్ యాప్ నిర్వహణ అంగన్‌వాడీలకు తలకుమించిన భారమైందన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ యాప్‌ను రద్దు చేయాలని, పనిభారాన్ని తగ్గించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు.

పింఛన్‌దారుల సదస్సును జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజేష్

మునగాల : సూర్యాపేట పట్టణంలో నేడు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో నిర్వహించే చేయూత పింఛన్‌దారుల జిల్లా సదస్సులో దివ్యాంగులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని భారత వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీవీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని కలకోవలో నిర్వహించిన గ్రామశాఖ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చేయూత పింఛన్ల పెంపుకై మంద కృష్ణమాదిగ చేస్తున్న ఉద్యమానికి తాము సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు, ఆగస్టు 13న హైదరాబాద్‌లో దివ్యాంగుల చేయూత పెన్షన్‌దారుల మహాగర్జన నిర్వహించనున్నట్లు తెలిపారు. వీవీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొల్లూరి ఈదయ్యబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి గడ్డం ఖాసీం, సంఘం జిల్లా అధ్యక్షుడు చింత సతీష్, మండల అధ్యక్షుడు గోపిరెడ్డి మదన్‌మోహన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనకు కృషి

హుజూర్‌నగర్ : నియోజకవర్గంలో గంజాయి నిర్మూలనకు కృషిచేస్తున్నట్లు సీఐ చరమందరాజు తెలిపారు. ఆదివారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని కొంతమంది పాత నేరస్తులకు గంజాయి నిర్ధారణ కిట్ ద్వారా పరీక్ష జరిపినట్లు తెలిపారు. ఎవరైనా గంజాయి తాగినట్లుగా అనుమానం వస్తే వారికి యూరిన్ కిట్ ద్వారా అక్కడిక్కడే టీఎస్ న్యాబ్ వారి పరకరాల ద్వారా నిజ నిర్ధారణ పరీక్ష చేస్తున్నట్లు తెలిపారు. గంజాయి యూరిన్ కిట్ (గంజా రాపిడ్ యూరిన్ కిట్)లో 12 రకాల పరీక్షలు నిర్ధారణ చేయవచ్చన్నారు. గంజాయి, హెరాయిన్, కొకైన్, తదితర మత్తు కలిగించే పదార్థాలను తీసుకుంటే ఈ పరీక్ష ద్వారా వారిని గుర్తించవచ్చన్నారు.

పేకాటరాయుళ్లపై ఉక్కుపాదం

పట్టణ పరిధిలో పేకాటరాయుళ్లపై ఉక్కుపాదం మోపుతున్నట్లు సీఐ చరమందరాజు తెలిపారు. ఆదివారం స్థానికంగా సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్కిల్ పరిధిలో 6నెలల్లో మొత్తం 19కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. 137 మందిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.1.36లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు, వాటిలో హుజూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో 3, గరిడేపల్లిలో 7, నేరేడుచర్లలో 3, మఠంపల్లిలో 3, పాలకవీడులో 3 మొత్తం 19 కేసులు నమోదు చేసి 137మందిని అదుపులోకి తీసుకుని వారిని సంబంధిత మండలాల తహసీల్దార్‌ల వద్ద బైండోవర్ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కేసుల్లో మొత్తం రూ.1,36,750ల నగదు, 45బైకులు, 67 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని కోర్టుకు రిమాండ్ చేసినట్లు ఆయన తెలిపారు.

ఐఐటీ పట్టా పొందిన నడిగూడెం విద్యార్థి



ఐఐటీ పట్టా తీసుకుంటున్న సాయిసంతోష్

నడిగూడెం : మండల కేంద్రానికి బుస్సా మహేష్ సులోచన దంపతుల కుమారుడు సాయి సంతోష్ ఆదివారం గౌహతి ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ పూర్తి చేసి సంబంధిత అధికారుల చేతుల మీదుగా పట్టా పొందారు. ఈ సందర్భంగా సాయి సంతోష్‌ను తల్లిదండ్రులతో పాటు, గ్రామస్తులు అభినందించారు.

మున్సిపాలిటీలో సమస్యలను పరిష్కరించాలి



డ్రెయినేజీని పరిశీలిస్తున్న నాయకులు

నేరేడుచర్ల : స్థానిక మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొణతం నాగిరెడ్డి అన్నారు. ఆదివారం పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మున్సిపాలిటీలోని 11వ వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీలోని అనేక వార్డుల్లో పారిశుద్ధ్యం, డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేదన్నారు. కాల్వల్లో పిచ్చిమొక్కలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. శిథిలావస్థలో ఉన్న గ్రంథాలయాన్ని వినియోగంలోకి తీసుకురావాలన్నారు. అదే విధంగా గ్రంథాలయంలో అన్ని రకాల పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలతో పాటు మౌలిక వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బాల వెంకటేశ్వర్లు, ఏమిరెడ్డి శంకర్‌రెడ్డి, కాలం నాగయ్య, గంధం శావయ్య, పుల్లెంల సైదులు తదితరులున్నారు.

ఎత్తిపోతల పథకం కమిటీ ఎన్నికకు సన్నాహాలు



సమావేశంలో మాట్లాడుతున్న జైపాల్‌రెడ్డి

మునగాల : సాగర్ ఎడమకాల్వపై మునగాల శివారులో ఏర్పాటు చేసిన ఎల్-33ఎత్తిపోతల పథకం పాలకవర్గం కమిటీ ఏర్పాటుకు కాంగ్రెస్ మండల కమిటీ ఆధ్వర్యంలో సన్నాహాలు ప్రారంభించారు. ఇందులో భాగంగా ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎల్-33 ఎత్తిపోతల పథకం మొదటి స్టేజీ పరిధిలో నలుగురు, రెండో స్టేజీ పరిధిలో నలుగురు డైరెక్టర్‌ను ఎంపిక చేసిన తర్వాత చైర్మన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోనున్నట్లు తెలిపారు. ఈ నెల 16న మండల కేంద్రంలోని రైతువేదికలో పథకం పరిధిలో గల రైతుల సమక్షంలో ఈ ఎన్నిక ఉంటుందన్నారు. సమావేశంలో పార్టీ మండల నాయకులు కాసర్ల కోటేశ్వరరావు, కాసర్ల బోస్, కాసర్ల వెంకట్, చింతకాయల నాగరాజు, చింతకాయల ఉపేందర్, పసుపులేటి గోపి, ఎం.రషీద్, కొమ్ము ఈదారావు, సిరికొండ చందు పాల్గొన్నారు.

దొడ్డా నారాయణరావు చిత్రపటానికి నివాళులు

చిలుకూరు : మండల కేంద్రానికి చెందిన సీపీఐ సీనియర్ నేత, మాజీ ఎంపీపీ దొడ్డా నారాయణరావు ఇటీవల మృతి చెందారు. ఆదివారం ఆయన చిత్రపటానికి వివిధ పార్టీల నాయకులు, సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, ఐఎఎల్ ఖమ్మం జిల్లా కార్యదర్శి ఓరుగంటి శేష గిరిరావు, ఐఎఎల్ సూర్యాపేట జిల్లా కార్యదర్శి గట్ల నర్సింహారావు, అడ్వకేట్ రమణ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాసరావు, బత్తినేని హనుమంతరావు, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చేపూరి కొండలు, వెంకటేశ్వరరావు, లచ్చీరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరంలాంటిది



చెక్కులు అందజేస్తున్న గుండు రామాంజీగౌడ్

గరిడేపల్లి : సీఎం సహాయ నిధి పేదలకు వరంలాంటిదని కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గుండు రామాంజీగౌడ్, మాజీ ఎంపీటీసీ బాల్దూరి సందీప్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని రాయినిగూడెంలో రూ.3లక్షల 67500లు చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాల్పడేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, పేదవారికి ఆసుపత్రి ఖర్చులలో పూర్తి భారం పడకుండా ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయడం సంతోషకరమన్నారు. సీఎం సహాయనిధి చెక్కులు రావడానికి కృషి చేసిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గుండు గురవమ్మ, గురవయ్య, అశోక్, సుధాకర్, సైదులు, కర్ణాకర్, బాబు, మహేష్, రాంబాబు, నాగరాజు, పుల్లయ్య, కోటేష్, మురళీ, గోపి, ముత్తయ్య ఉన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక చేయూత



గరిడేపల్లి : ఆర్థికసాయం అందజేస్తున్న యూనియన్ సభ్యులు

గరిడేపల్లి : మండల పరిధిలోని కల్మలచెరువు గ్రామానికి చెందిన ట్రాక్టర్ మేస్త్రీ షేక్ సైదులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం సైదులు కుటుంబానికి గ్రామానికి చెందిన ట్రాక్టర్ ఓనర్ యూనియన్ ఆధ్వర్యంలో రూ.లక్ష 6వేల ఆర్థికసాయం అందజేశారు. అదే విధంగా మృతుడి కుటుంబానికి మాజీ సర్పంచ్ మూలగుండ్ల విజయసీతారాంరెడ్డి క్వింటా బియ్యం అందజేశారు. కార్యక్రమంలో గుండ్ల సత్యనారాయణ, మీసాల యోహాన్, యడవెల్లి చంద్రశేఖర్‌రెడ్డి, బచ్చలకూరి కృష్ణప్రసాద్, బొల్లగాని నాగేష్, అమరవరపు బాబు, రాములు, సుధాకర్, సైదులు, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం పంపిణీ

నడిగూడెం : మండల కేంద్రానికి చెందిన కాసాని నాగేశ్వరరావు (46) ఇటీవల చెట్టు పైనుంచి పడి మృతి చెందాడు. మృతుడు నిరుపేద కుటుంబానికి చెందడంతో ఆదివారం ఉత్తమ్ పద్మావతి యువసేన ఆధ్వర్యంలో కోదాడ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వేపూరి తిరుపతమ్మ 50కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి వేపూరి సుధీర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుండు మహేందర్, ఎలుగూరి నాగరాజు, దున్నా వీరబాబు, పల్లపు గోపాల్, మండవ నర్సయ్య, శ్రీరాముల శ్రీను, శ్రీకాంత్, వంశీ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీత్లా పండుగ

పాలకవీడు : మండలంలోని కల్మేట్‌తండాలో గిరిజనులను ఆదివారం సీత్లా పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఊరేగింపుగా వచ్చి సీత్లా భవానీ గద్దెలకు మొక్కులు చెల్లించుకుని నైవేద్యాలు సమర్పించారు. ప్రతీ ఏడాది ఆషాఢమాసంలో ఈ పండుగను గిరిజనులు జరుపుకోవడం ఆనవాయితీ. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఊరేగింపుగా వస్తున్న గ్రామస్తులు

అక్రమ అరెస్టును ఖండిస్తున్నాం

హుజూర్‌నగర్ : తుంగతుర్తి నియోజకవర్గం పరిధిలోని తిరుమలగిరిలో సోమవారం జరిగే సీఎం రేవంత్‌రెడ్డి సభ నేపథ్యంలో స్థానిక బీఆర్‌ఎస్ నాయకులను ముందస్తుగా అదుపులోకి తీసుకోవడాన్ని ఖండిస్తున్నామని ఆ పార్టీ నాయకులు అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద వారు విలేకరులతో మాట్లాడారు. అరెస్ట్ అయిన వారిలో బీఆర్‌ఎస్ నాయకులు ములకలపల్లి రాంబాబు, నగేష్ రాథోడ్, దొడ్డ నరసింహారావు, జక్కుల నాగేశ్వరావు, కోలా శ్రీనివాస్, అమర్ గౌడ్, కేఎల్‌ఎన్ రెడ్డి, నబీ, అలీ, శిలం వెంకీ, రాము, సాయి, హన్ను తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులు సరికాదు

పాలకవీడు : తిరుమలగిరిలో నేడు జరిగే సీఎం బహిరంగ సభను బీఆర్‌ఎస్ పార్టీ అడ్డుకుంటుందని మండల పోలీసులు స్థానిక బీఆర్‌ఎస్ నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం సరికాదని ఆ పార్టీ రాష్ట్ర యువజన నాయకుడు పెరుమాళ్ల సతీష్ అన్నారు. ఆదివారం ఆయన స్థానికంగా మాట్లాడారు. ఎన్ని అరెస్టులు చేసినా ప్రజలకిచ్చిన హామీలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. అరెస్టైన వారిలో నాయకులు లక్ష్మీనారాయణ, నాగయ్య, రమేష్, వీరబాబు తదితరులున్నారు.

గడ్డివాము దగ్ధం

నడిగూడెం : మండల పరిధిలోని రామాపురం గ్రామానికి చెందిన భూసరాజు ఉప్పలి గడ్డివాముకు ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. దీంతో 450 గడ్డిమోపులు దగ్ధమయ్యాయి. గడ్డిమోపులు విలువ రూ.50వేలు ఉంటుందని బాధితుడు వాపోయాడు. నిప్పంటించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

చిలుకూరు : క్యూ న్యూస్ చానల్ కార్యాలయంపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీసీ సంఘం నాయకులు రాంబాబు, కాశయ్య, శ్రీను, రవి డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు తీసుకువస్తున్న సందర్భంగా బీసీ ఉద్యమానికి సంబంధం లేకుండా కవిత సంబరాలు జరుపుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయంపై ప్రశ్నించిన తీన్మార్ మల్లన్నపై భౌతికదాడులకు దిగడం సరికాదన్నారు. సమావేశంలో సత్యం, ఉపేందర్, వెంకన్న, ప్రభాకర్ పాల్గొన్నారు.